క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో రైల్వే జడ్జి



రైల్వే జడ్జి దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ పండితులు

సామర్లకోట: దక్షిణ మధ్య రైల్వే (విజయవాడ) కోర్టు జడ్జి ఆర్.వెంకటేశ్వరశర్మ దంపతులు స్థానిక పంచారామ క్షేత్రంలో కుమారా రామభీమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరిలను దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి ఆలయానికి వచ్చిన జడ్జి దంపతులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఆలయంలో పూజల అనంతరం ఆలయ పండితులు జడ్జి దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు.

రేపు హిందూ చైతన్య సమావేశం

సామర్లకోట: స్థానిక మఠం సెంటర్‌లోని వీరభద్ర రామాలయంలో ఆదివారం హిందూ చైతన్య సమావేశం జరుగుతుందని హిందూ ఐక్యవేదిక ప్రతినిధి బీవీకే మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ మేరకు అయోధ్య రామపురంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మఠం సెంటర్‌లోని రామాలయంలో పట్టణ పరిధిలోని హిందూ బంధువులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు.

విద్యార్థి కిట్లను సద్వినియోగం చేసుకోండి



సామర్లకోటలో విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన ఎంఈఓలు

సామర్లకోట: విద్యార్థులకు ఇస్తున్న విద్యార్థి మిత్ర కిట్లను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు వై.శివరామ కృష్ణయ్య, పి.వుల్లయ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక బ్రౌన్‌పేటలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వారు పుస్తకాలు పంపిణీ చేశారు. బ్యాగ్‌లు, బూట్లు, యూనిఫాం ఇవ్వాల్సి ఉన్నదని తెలిపారు. కార్యక్రమానికి హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని, మానవహక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

92వసారి రక్తదానం



రక్తదానం చేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు శుక్రవారం 92వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన కాకినాడలోని బ్లడ్ బ్యాంక్‌కులో రక్తదానం చేశారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శారద, అభినయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మట్టపర్తి శ్రీధర్ సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



నవఖండ్రవాడ వద్ద తూటికాడతో పూడుకు పోయిన పీబీసీ కాలువ

క్లోజర్‌లో జలగలు!

- ఎక్కడి తూడు అక్కడే
- కాలువ కనవడనంతగా కమ్మేసిన వైనం
- అస్తవ్యస్తంగా సాగునీటి వ్యవస్థ
- మరమ్మతులకు నోచుకోని గండ్లు
- ఆందోళనలో ఏలేరు, పీబీసీ రైతులు

పిఠాపురం: పని చేసినట్లు ఉండాలి.. కాని చేయకూడదు.. చేసినట్టుగా రాసుకుని దొరికినంతా దోచేయాలి.. ఇదీ ప్రస్తుతం కాలువల అభివృద్ధిలో సాగుతున్న తంతు. కూటమి నేతలు చేస్తున్న క్లోజర్ పనుల తీరుకు రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. నియోజకవర్గంలో ఏ కాలువ చూసినా పూడికతో నిండి పోయి ఉండగా క్లోజర్ పనులు మాత్రం శరవేగంతో జరుగుతున్నట్లు కూటమి నేతలు ఫొటోలకు ఫోజులిస్తున్నారని రైతులు అంటున్నారు. ఒక పక్క కాలువలకు నీరు విడుదల చేయగా ఇంకా ఎక్కడి గండ్లు అక్కడే ఉండడంతో ఇక ఈ ఏడాదికి కాలువల అభివృద్ధి లేనట్టేనని రైతులు వాపోతున్నారు. వరదలు వస్తే పంటలు కొట్టుకుపోవడం ఖాయమంటున్నారు. సార్వా సీజన్ ప్రారంభమైంది. రైతులు వరి నారు వేసే పనిలో బిజీగా ఉన్నారు. ఈ మధ్యలో చేపట్టాల్సిన పంట కాలువల అభివృద్ధి పనులు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో ఏలేరు, పీబీసీ కాలువ ద్వారా పంటలకు సాగు నీరు అందే ప్రాంతాల్లో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుణ్య కాలం పూర్తవుతున్నా ఎక్కడా కాలువల్లో పూడికలు తీస్తున్న దాఖలాలు లేక పోవడంతో ఇంకెప్పుడు చేస్తారంటూ ఆంటు రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది సార్వాలో ఏలేరు వరదలు నియోజకవర్గంలో పంటలను నట్టేట ముంచగా రబీలో అకాల వర్షాలు పంటలను నాశనం చేశాయి. ఒక పక్క కాలువలు, తూములు, స్లూయిస్‌లు అన్నీ మరమ్మతులకు గురై శిథిలావస్థలో ఉండి ఎక్కడా సాగు నీరు సక్రమంగా పారే పరిస్థితి లేక పోవడంతో పంట విరామ సమయంలో అన్నీ పూర్తి చేస్తారని ఆశగా ఎదురు చూశామని, కాని ఎక్కడా పనులు చేయక పోవడంతో ఈ ఏడాది నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిఠాపురం సమీపంలో గొర్రిఖండి కాలువ వద్ద గట్టు సరి చేసి బల్లలు వదిలేశారు



పిఠాపురం మండలం రాపర్తి సమీపంలో ఏలేరు కాలుపై గతంలో పడిన గండి



పిఠాపురం మండలం రాపర్తి సమీపంలో అధ్వానంగా ఉన్న పంట కాలువ

రేపో మాపో పంట కాలువలకు నీరు వదులుతారు. ఈ లోగా కాలువల్లో పూడికలు తొలగించి, గండ్లు పూరించి సాగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కాలువల్లో పేరుకుపోయిన తూటికాడ అసలు ఇది కాలువేనా అనే భ్రమ కల్పిస్తోంది. నీటి చుక్క కనపడని విధంగా కాలువలన్నీ ఇలానే పచ్చని పంటలా కనిపిస్తున్నాయి. మరి క్లోజర్ అంటే కాలువ కనపడకుండా క్లోజ్ చేయడమనుకున్నారో ఏమో మరి. క్లోజర్ పనులకు విడుదల చేసిన నిధులను కాలువ నీటితో పాటు జలగల్లా పీల్చేశారో ఏమో మరి!

మత్స్యశాఖాధికారిగా నూకరాజు



సామర్లకోట: వేట్లపాలెం మత్స్యశాఖాధికారిగా రాయి నూకరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు పనిచేసిన ప్రకాశరావు బదిలీపై కాకినాడ వెళ్లారు. ఆయన స్థానంలో నూకరాజు బాధ్యతలు స్వీకరించారు. మత్స్యశాఖ సిబ్బంది సీహెచ్ పరుశురాం, పి.మౌనిక, డి.మౌనిక నర్గీస్ నూకరాజును అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

కాకినాడ రూరల్: వ్యవసాయం కోసం చేసిన అప్పులు పేరుకుపోయి, తాకట్టు పెట్టిన ఇంటిని బ్యాంక్ అధికారులు స్వాధీనం చేసుకోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందిన కొటికల రాజేష్ (29) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ రూరల్ పండూరులో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం రాజేష్, అతని అన్నయ్య కలసి రెండేళ్ల కిందట కౌలుకు వ్యవసాయం చేశారు. తండ్రి లేకపోవడంతో కుటుంబ భారం మోస్తూ వ్యవసాయం చేసేందుకు ఇంటిని బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారు. వ్యవసాయంలో నష్టపోయి బ్యాంక్ రుణం చెల్లించలేకపోయారు. పలు దఫాలుగా నోటీసులు ఇచ్చిన బ్యాంక్ అధికారులు చివరకు వారి ఇంటిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన రాజేష్ మానసికంగా కుంగిపోయాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో గడ్డి మందు తాగి, ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి అతడు మృతి చెందాడు. మృతుడి తల్లి అప్పలకొండ ఫిర్యాదు మేరకు తిమ్మాపురం ఎస్సై గణేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొన్నాడలో మన ఊరు-పనితీరు



పొన్నాడలో ఉపాధి శ్రామికులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ గ్రామపంచాయతీ వద్ద శుక్రవారం మన ఊరు- పనితీరు, పారదర్శక బోర్డులను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఎస్ఆర్‌పీ, డీఆర్పీలు ప్రారంభించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, విద్య, కమ్యూనికేషన్, లక్ష్యాలు, ప్రయోజనాలు, నూతన అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయం వద్ద గ్రామ ముఖచిత్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో కలిసి అధికారులు కాలువలో పూడిక తీశారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకం ఎస్ఆర్‌పీ, డీఆర్పీలు మాట్లాడుతూ రోజువారీ వేతనంగా రూ.307 ఇవ్వడం జరుగుతుంది. శ్రామికులకు 100 రోజులు పని కల్పించాలన్నారు. 2025 నుంచి ప్రభుత్వం కొత్తచట్టం ప్రకారం జరిగిన ఆడిట్, ఉపాధి పనులకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు తెలిపారు. ముఖ్యంగా ఉపాధి పనులు చేసేవారిని శ్రామికులుగా పిలవాలన్నారు. పనికావాలన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించ వలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉపాధి పనులపై అవగాహన కల్పించినపుడే పనులలో అవకతవకలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యమిచ్చి దైన్యంలోకి..!

- రెండు నెలలైనా అందని సొమ్ములు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

సామర్లకోట: మండల పరిధిలోని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన ధాన్యానికి సొమ్ములు ఎప్పుడు విడుదల చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఏప్రిల్ 9వ తేదీ నుంచి ధాన్యం సొమ్ముల చెల్లింపు నిలిచపోయాయని మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్ ఆరోపించారు. జి.మేడపాడు వేట్లపాలెం గ్రామాలకు చెందిన సుమారు 250 మంది రైతులకు సుమారు రూ. 3.9 కోట్ల సొమ్ము బకాయి ఉన్నట్టు ఆయన తెలిపారు. అలాగే వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలకు చెందిన సుమారు 125 మంది రైతులకు రూ.కోటి వరకు సొమ్ము రావలసి ఉన్నదని రైతులు చెప్తున్నారు. ఇక నవర, గొంచాల, అచ్చంపేట, ఉండూరు, కాపవరం, పి.వేమవరం, పవర గ్రామాల్లో సుమారు 200 మంది రైతులకు రూ.రెండు కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించినా సొమ్ములు రావడం లేదని, బస్తాకు రూ.100 తగ్గించి దళారులకు విక్రయించే పరిస్థితి కల్పించారనే విమర్శలు ఉన్నాయి. గోదావరి కాలువకు నీరు రావడం, వర్షాలు పడడంతో సార్వాలో పంట సాగు చేసుకోవడానికి ధాన్యం సొమ్ము రాక పోతే వ్యవసాయం ఎలా చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు వేస్తామని చెప్పి ఏడాది గడిచినా ఎటువంటి సాయం అందలేదని రైతులు వాపోతున్నారు. వీకే రాయపురం గ్రామానికి చెందిన రైతులు ఆకలి బాధతో రైతు భరోసా కేంద్రాన్ని ముట్టడించి తమ ధాన్యం సొమ్ము చెల్లింపుపై పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.



ధాన్యం సొమ్ము కోసం ఎదురు చూస్తున్న రైతులు

వర్మీ కంపోస్ట్‌తో నాణ్యమైన దిగుబడులు



ఏరువాక కేంద్రంలో శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దాపురం: సేంద్రియ ఎరువు వర్మీ కంపోస్ట్ వినియోగం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుజాత అన్నారు. వ్యవసాయ పరిపతి సంఘం ఎరువుల డీలర్ల సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా శుక్రవారం వర్మీ కంపోస్ట్ సేంద్రీయ ఎరువులు - ఆవశ్యకత అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త నరసింహరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో వర్మీ కంపోస్ట్ లభ్యత, వాటి వల్ల ప్రయోజనాలు తెలియజేశారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించగా డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ పలు సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సీహెచ్ పద్మ, చల్లా వెంకట నరసింహరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయాల పై చర్యలేవీ?

- అధికారులపై జెడ్పీటీసీ నాగలోవరాజు ఆగ్రహం
- పలు సమస్యలపై మండల సమావేశంలో చర్చ



ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను నిలదీస్తున్న నేతలు

పిఠాపురం: సంచులతో బహిరంగంగా ఇంటింటికీ తిరిగి మరీ సారా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోరా అంటూ జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు ఎక్సైజ్ అధికారులపై మండిపడ్డారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన అధికారులను నిలదీశారు. ఎక్సైజ్ శాఖ నుంచి హెడ్ కానిస్టేబుల్ సూర్యచంద్రరావు హాజరు కావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధ్యత కలిగిన అధికారి కాకుండా హెడ్ కానిస్టేబుల్ హాజరుకావడం ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్ స్తంభాలు తెచ్చి నెలలు గడుస్తున్నా ఏర్పాటు చేయడం లేదని ఎంపీపీ అచ్చియ్యమ్మ, అరిగెల రామయ్య దొర అధికారులను నిలదీశారు. ఇంటింటికీ కుళాయి పథకంలో భాగంగా గ్రామాల్లో ఓవర్ హెడ్ టాంకులు నిర్మించిన అధికారులు పైపు లైన్లు వేసి కనెక్షన్లు మాత్రం ఇవ్వడం లేదని, దీంతో ఈ వేసవిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఏకే మల్లవరం, కొడవలి సర్పంచ్‌లు అరిగెల మణిబాబు, బుర్రా రామచంద్ర అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ పనులు ఏ ప్రాతినదికన చేపడుతున్నారని తాము అడిగితే పనులు చేపట్టడం లేదంటున్నారని తీరా చూస్తే గుట్టుచప్పుడు కాకుండా పనులు చేస్తున్నారని జడ్పీటీసీ నాగలోవరాజు, అరిగెల రామయ్య దొరలు ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. అసలు పనులు ఎక్కడ చేశారో చెప్పాలన్నారు. శివారు ప్రాంతాల్లో అసలు పనులు చేసిన ఆనవాళ్లు కూడా లేవని దీని వల్ల వర్షాకాలంలో పంటలు ముంపుబారిన పడడం ఖాయమన్నారు. పంట పొలాలు ముంపు బారిన పడితే దానికి అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. వీర్రాజు కాలువ ముందు భాగంలో తీసి వదిలేసారని అంతా చేసినట్లుగా ఇరిగేషన్ క్లోజర్ పనుల్లో చూపించి బిల్లులు చేసుకుని దోపిడీ చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాకపల్లి దేవి, వైస్ ఎంపీపీలు బత్తిన మంగ, నేమాని ఆదివిష్ణు, ఎంపీడీఓ కర్రి స్వప్న పలువురు సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్: మండల పరిధిలోని పోలవరం బీచ్ రోడ్డులో జగన్మోహనపురం ఆర్చ్ ఎదురుగా సముద్రం ఒడ్డున గుర్తు పట్టడానికి వీలు లేని విధంగా పాడైన వ్యక్తి మృత దేహం లభ్యమయ్యింది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడి వయసు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండవచ్చు. మృతదేహం బోర్లా పడి ఉండడంతో పాటు చర్మం పూర్తిగా కుళ్లిన స్థితిలో పుర్రె, ఎముకలు బయటకు కపిస్తున్నాయి. మృతుడి ఒంటిపై ఎరుపు రంగు కట్ బనియన్, నలుపు రంగు డ్రాయర్ ఉన్నట్టు గుర్తించారు. వీఆర్వో పితాని సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిస్తే తిమ్మాపురం పోలీసు స్టేషన్ నంబరు 0884-2306332తో పాటు సెల్ నంబరు 94407 96556కు సంప్రదించాలని కోరారు.

చురుగ్గా గడ్డర్ల ఏర్పాటు



సామర్లకోట-కాకినాడ రోడ్డులో సాగుతున్న గడ్డర్ల నిర్మాణ పనులు

సామర్లకోట: అచ్చంపేట నుంచి సామర్లకోట ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ వరకు జరుగుతున్న భారత్ మాల జాతీయ రహదారి బ్రిడ్జి పనులలో భాగంగా సామర్లకోట-కాకినాడ రోడ్డులో శుక్రవారం గడ్డర్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అచ్చంపేట జంక్షన్ నుంచి అధునాతన సాంకేతిన పద్ధతుల్లో ఫ్లైఓవర్‌కు సంబంధించి స్తంభాల నిర్మాణం పూర్తి చేశారు. వాటిని కలుపుతూ రెడీమేడ్ గడ్డర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సాంకేతిక నైపుణ్యంతో తయారైన గడ్డర్లు ఆయా ప్రదేశాలకు చేరు కున్నాయి. దాంతో ఈ నెల 7వ తేదీ నుంచి సామర్లకోట-కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం వద్ద నుంచి ట్రాఫిక్ మళ్లించారు. ఈ ఏర్పాట్లను ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు పర్యవేక్షించారు.

పత్ర, గాత్ర సమ్మేళనం

విజ్ఞాన, వినోదాల సమాహారంగా ఎరెవ్నా రెండో రోజు సదస్సు

కాకినాడ క్రైం: పత్రం, నృత్యం, గాత్రం ఇలా విజ్ఞాన, వినోదాల సమాహారంగా రెండో రోజు ఎరెవ్నా 4.0 సదస్సు శుక్రవారం ఘనంగా జరిగింది. కాకినాడ జీజీహెచ్, ఆర్ఎంసీ ఆవరణలు ఇందుకు వేదికయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రోజు సదస్సు విద్యార్థులకు విజ్ఞానదాయక అనుభూతిని కలిగించింది. ఉదయం పత్ర సమర్పణల అనంతరం ట్రెజర్ హంట్ పేరుతో వైద్య విజ్ఞానాన్ని పెంపొందించే పోటీల పరంపరం మొదలైంది. 9 నుంచి 12 గంటల మధ్య హ్యాండ్స్ ఆన్ సర్జరీ, బేసిక్ ట్రామా, ఎక్యూట్ మెడికల్ కేర్ అండ్ హ్యాండిలింగ్ ఎమర్జెన్సీస్, ఫీటల్ అటాప్సీ, విజియోనెక్స్, టినీ బేబీస్ బిగ్ స్కిల్స్ అంశాలపై ప్రయోగాత్మక ప్రక్రియల ద్వారా విషయావగాహన పెంపొందించుకున్నారు. అలాగే, నియోనెటాలజీ, బర్నింగ్ బ్రిలియన్స్, న్యూరో సర్జరీ సంబంధిత ప్రక్రియలు, రేడియేషన్ ఆంకాలజీ, కాగ్నిటివ్ కరెంట్స్, డయాగ్నస్టిక్ స్కిల్స్ అంశాలపై పత్ర సమర్పణ చేశారు. అనంతరం మెడికల్ డిబేట్ నిర్వహించారు. సాయంత్రం రంగరాయ వైద్య కళాశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నృత్యం, గాత్రంతో అదరగొట్టారు. శుక్రవారం రాత్రి వరకు ఈ కార్యక్రమాలు అట్టహాసంగా సాగాయి. మెడికో హరికృష్ణ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు అనుబంధ కార్యక్రమాల్లో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా డ్యాన్స్ చేస్తున్న వైద్య విద్యార్థులు



మృతదేహం తలపై న్యూరో సర్జరీ ప్రక్రియలు చేస్తున్న వైద్య విద్యార్థులు

అల్బనిజం జన్యు సంబంధ సమస్య

కాకినాడ రూరల్: అల్బనిజం పుట్టకతో వచ్చే అనారోగ్య సమస్య అని దీనిని జన్యుపరంగా వచ్చే అరుదైన సమస్య అని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ అల్బనిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అల్బనిజం, తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ వ్యాధిగ్రస్తులు ఎక్కువ సేపు సూర్యరశ్మిలో ఉండలేరన్నారు.